కథానిక

# కట్టు కథ

వి. వి. సూర్యనారాయణ

ఉత్తరమైనా వ్రాయకుండా అకస్మాత్తుగా అత్తవారింటికెళ్ళి భార్యను కలుసుకోవడంలో ఒక విధమైన మధురానుభూతిని పొందవచ్చునని అనుభవశాలియైన సూర్యం చెప్పేడు.

ఆ మర్నాడు అత్తవారింటికి బయలుదేరదలచేను. ముందుగా నా రాకను గురించి వాళ్లకేమీ తెలియజేయలేదు; కనుక సూర్యం చెప్పిన మాటల్లోని సత్యాన్ని పరీక్ష చేయగలిగే అవకాశం లభిస్తుందనుకున్నా. బయలుదేరేముందు నా భార్య ప్రాణమిత్రురాలైన మిస్ హెలెన్‌ను ఓసారి చూసి వెళ్ళడానికి నిశ్చయించుకున్నా. పుట్టింటికి వెళ్లేముందు, 'మీరెప్పుడైనా అక్కడకు వస్తే మిస్. హెలెన్‌ను ఒకసారి కలుసుకుని మరీరండి' అని శ్రీమతి చెప్పిన మాటలు జ్ఞప్తికి వచ్చేయి. అందుకనే ఆమెను కలుసుకుందుకు నిశ్చయించుకున్నాను.

మిస్. హెలెన్ ఆవూళ్ళో లేడీ డాక్టరు. ఆమె బంగళా ఊరికి కొంచం దూరంలో ఉంది. ఆ బంగళాకు దగ్గరగానే ఆమె హాస్పిటల్ కూడా ఉంది. ఆమెకు కుక్కల్ని పెంచడమంటే మంచి సరదా. ఆమె రెండు కుక్కల్ని పెంచుతూంది కూడా. అందమైన బొచ్చూ, చక్కటి చెవులూ గల సీమకుక్కలవి. బంగళాలో క్రొత్తవాళ్లెవరైనా అడుగుపెట్టగానే, వాళ్ళమీదకు దుమికి, అరుస్తూ వాళ్లని వెంటతరిమి, పరుగెత్తించి నానా హంగామా చేస్తాయి. నా విషయంలో కూడా యిదే జరిగింది. రెండు కుక్కలూ ఒకేసారి నామీద దుమికేయి నా ప్రాణం ఎగిరిపోయినట్టయింది. కంగారులో వెనుక ముందులు చూసుకోకుండా, సోఫామీద కూర్చున్నట్టు ఒక ముళ్లకంచెమీద చతికిలపడ్డాను. బ్రహ్మప్రళయంమీద అక్కడి నుంచి లేచి పరుగెత్తాను. కాని రెండడుగులు వేసేసరికి కాలు మడతపడి ఆ రెండు కుక్కలలో ఒకదానిమీద బలంకొద్దీ పడిపోయాను. మళ్లా లేవడం ఖంగారులో రెండోకుక్కను తొక్కేసి రోడ్డుమీద బోర్లాపడ్డాను. అతిప్రయాసమీద అక్కడినుండి లేచి మెల్లగా బంగళాలో ప్రవేశించగలిగేను. రెండుకుక్కలూ కొంప మునిగిపోయేలా అరుస్తూ వెనుకనుంచి వెంట తరుముకొని వస్తున్నాయి. ఆ గాభరాలో యెటు వెళ్ళాలో తెలియక మెల్లగా నవ్వుతూ వస్తూన్న డాక్టర్. హెలెన్ మీదపడ్డా. ఆమె వెనక్కి సోఫాలో చతికిలపడింది. నా చేయూత పుచ్చుకొని ఆమె లేచి కుక్కల్ని అక్కడినుంచి తీసికొనివెళ్ళి బయట కట్టేసి వచ్చింది. అప్పటికి నాకు ఊపిరి తిరిగింది.

అయిదు నిముషాలు గడిచేక ఆవిడ కాఫీ తెప్పించింది. పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ యిద్దరం కాఫీ తాగుతున్నాం. నా కుడిచేతి మణికట్టుమీద రక్తం చిమ్ముతూండడం చూసి, 'ఏమిటిది ?' అనడిగింది, మిస్. హెలెన్.

'మీ కుక్కలధాటికి తట్టుకోలేక రోడ్డుమీద పడ్డాను.' అన్నా.

'అరే! ఎంతపని జరిగింది' అని ఆ గాయాన్ని ఆవిడ పరీక్షించి, 'నేనిప్పుడే డ్రెస్సింగ్ చేస్తానుండండి.' అంది.

'అఁ! అదే పోతుందిలెద్దురూ. ఈ చిన్న దెబ్బకి డ్రస్సింగ్ కూడాఎందుకు?' అన్నా ధీమాగా.

'ఏమండోయ్! ఇదేమీ మామూలు దెబ్బ కాదు, ఊరుకోవటానికి. వెంటనే డ్రస్సింగ్ చెయ్యకపోతే చాలా ప్రమాదం.' అంది సీరియస్‌గా ముఖం పెట్టి.

'ప్రమాదం ! ఏమిటి ప్రమాదం ?'

'ధనుర్వాతమండీ! ధనుర్వాత మొస్తుంది.'

ధనుష్టంకం, ధనుర్మాసం, ధనుష్కోడి— యివన్నీ విన్నా. కాని, యీ ధనుర్వాతమేమిటి? 'అంటే ఏమిటి, డాక్టర్?' అనడిగేను.

మిస్. హెలెన్ చెప్పింది, 'అదొక విషజ్వరం. గాయాలను, అందులోనూ రోడ్డుమీద

పడ్డప్పుడు తగిలిన గాయాలను నిర్లక్ష్యంగా వదిలేస్తే సూక్ష్మజీవులు లోపల ప్రవేశించి విషజ్వరాన్ని కలుగజేస్తాయి. ఒక్కరోజులోనే కండరాలన్నీ కుంచుకుపోయి రోగి చనిపోతాడు. కొంతమందిలో కాళ్లూ చేతులూ కూడా వాచిపోయి, సంధి పుడుతుంది. ఏమైనా, చాలా ప్రమాదం. ఈ విషయం చెప్తూ మిస్. హెలెన్ నా చేతికి కట్టుకట్టింది. ఆమె దగ్గర శలవు తీసికొని యింటికి బయలుదేరాను. వచ్చేటప్పుడు సైకిలు తీసికొని రాకపోవడమే మంచిదైంది. తెస్తే, తిరిగి వెళ్లేప్పుడు నా పాట్లు దేవుడికి తెలిసేవి. బండి చేయించుకొని యింటికి బయలు దేరాను.

దారిలో సూర్యం కనిపించి మంచిచెడ్డా, ఆ మాటా యీ మాటా చెప్తూ బండి ఆపు చేశాడు. 'ఏమోయ్! బొత్తిగా కంట్లో నలుసువై పోయావే! క్షేమమా?... చేతికా కట్టేమిటి?'

రోడ్డుమీద పడ్డంవల్ల దెబ్బ తగిలిందనీ, ధనుర్వాతం రాకుండా కట్టుకట్టారనీ చెప్పేను. ధనుర్వాతం అంటే సూర్యం నమ్మలేదు. 'ఆఁ! ఆకట్టు విప్పిపారేసి, పసుపూ, నూనెకలిపి రాయవోయ్, అదే పోతుంది.' అతనికి తోచిన సలహా యిచ్చేడు.

తరువాత రాజు కనబడి బండి ఆపి, క్షేమ సమాచారములు కనుక్కున్నాడు. చేతికి కట్టు చూసి అతనుకూడా హేళన చేశాడు. 'ముండ వెంకు వేపరసంలో అరగతీసి వెయ్యవోయ్! దానికి పెద్దకట్టుకూడా ఎందుకు?' అని చెప్పి గట్టిగా సవ్వాదం మొదలుపెట్టేడు, గోసాయి చిట్కాలన్నీ తెలిసినవాడిలాగ.

దారిలో పరిచయస్తులింకా నలుగురైదుగురు కనపడ్డారు. అందరూ ధనుర్వాత మన్నమాటవిని నవ్వి హేళన చేశారేకాని, ఒకరూ నమ్మలేదు. ఎండుమిరపకాయల గుండరాయమని ఒకడూ, సున్నం బెల్లం కలిపి పట్టువెయ్యమని ఒకడూ, గాలికి వదిలెయ్యి అదే పోతుందనొకడూ ఎవరికి తోచిన చిట్కాలు వాళ్లు తెలియపరచేరు.

ఇంటికి రాగానే అమ్మా, నాన్నగారూ కూడా 'చేతిమీదా కట్టేమిటిరా?' అనడిగేరు. జరిగిన సంగతంతా చెప్పేను. తరువాత నౌకరు వెంకన్న అడిగేడు, 'అయ్యగారూ! సేతికా కట్టేటండీ?' అని. నిజం చెప్పి వాణ్ణి నమ్మించేందుకు బ్రహ్మాండం తలక్రిందులైంది.

మర్నాడు ప్రొద్దున వీధి అరుగుమీద కూర్చొని ముఖం కడుక్కుంటూంటే వాడుకగా పాలుపోసే జగ్గయ్యకూడా అదే విషయం ప్రస్తావించకుండా ఉండలేక పోయాడు. రోజూ వచ్చిపోతూ ఉంటాడు. ఎలా అడక్కుండా ఉండగలడు? 'అన్నయ్యకు ధనుర్వాతం రాకుండా కట్టుకట్టారు.' అని చెప్తున్నాడు, కుర్రవెధవ. ఇంకా ఆవైపు తిరగకుండానే, 'అయ్యగారి కేటో పిచ్చి నమ్మకాలు' అంటూ వెళ్లిపోయాడు జగ్గయ్య. వీళ్ళంతా పడే అపసోపాలు చూస్తే నాకు వళ్లు మంటెక్కింది.

మర్నాడు ప్రయాణం పెట్టుకున్నవాడినల్లా ఆరోజు సాయంత్రం బండికే బయలుదేర దలచేను. అత్తవారింటికి ప్రయాణ సన్నాహంలో ఉండగా ఊళ్లో ఉన్న స్నేహితులంతా ఓ ముఠాలాగా వచ్చిపడ్డారు, యింటి ముందు.

'ఏమిట్రా, యిలా వచ్చేరు?' అన్నా ఆశ్చర్యంతో, అంతమంది ఒక్కసారి రావడానికి కారణమేమిటనాలోచిస్తూ.

'నీకు ధనుర్వాతం వచ్చిందని చెప్పేడురా, మీ తమ్ముడు. చూసిపోదామని వచ్చేం' అన్నారు అంతా ఏకగ్రీవంగా.

నాకు ధనురాత్వం యింకా రాలేదని, ప్రస్తుతం దెబ్బమాత్రం తగిలిందని చెప్పా. వాళ్ళచేత అడిగించుకోవడమనే బాధనుండి తప్పించుకోవాలని చూశాను. కాని, ఆ ధనుర్వాత మనే సంగతి రాకుండా వాళ్లు వదిలి పెట్టందే! రోడ్డుమీద పడితే నిజంగా ధనుర్వాతం వస్తుందిరా, నాకు తెలుసు.' అన్నాడొకడు, తనకు తెలియని విషయం లేదనుకుంటూ. నాకు చాలా చిరాకు వేసింది కాని, ఏమీ చెయ్యలేకపోయా. చివరకు వాళ్ళందర్నీ వదలించుకునేందుకు నాకల ప్రాణం తోకకు వచ్చింది.

వాళ్ళంతాపోగానే బండి పిలిపించి స్టేషనుకు బయలుదేరా. 'చేతికా కట్టేందు కండయ్యా?' బండివాడూ అదే ప్రశ్న! స్టేషన్లో నాతో పరిచయమున్నవాళ్లు కూడా అదే ప్రశ్న అడి

గారు. రైలు బయలుదేరేముందు ప్లాట్‌ఫారం మీదకనుపించిన గోవిందరాజులూ అదేఅడిగాడు.

రైలు కదలగానే వాడి బాధ వదిలిందని సంతోషించా. 'ఎందుకైనా మంచిది. సత్యం, పానం జాగ్రత్త సుమా.' అంటూ వెళ్లిపోయాడు గోవిందరాజులు.

కర్మం చాలక నేనెక్కిన పెట్టెలో పరిచయస్థులు చాలామంది ఉన్నారు.—మా వూరి మార్వాడీ, లక్ష్మణరావూ తదితరులు. ఇక మళ్లా మొదలు. లక్ష్మణరావు అడిగేడు, 'చేతికా కట్టేమిటండీ?' అని స్వర్గానికెళ్లినా సవితి పోరు తప్పలేదుట! నాకు చాలా కోపం వచ్చింది. ఎంతో విసుగేసింది. 'దెబ్బ తగిలింది' అన్నా ముఖం ముకుళించుకుని. ఇక మొదలు ప్రశ్నల వర్షానికి. అడిగేవాడికి చెప్పేవాడు లోకువ. నా బాధ అతనికేమి అర్థం అవుతుంది?

'మొసలి,కరిచిందిలెండి,'అన్నాదీర్ఘాలుతీస్తూ.

'మొసలి!......మొసలి కరిచిందా?'

'అవును.' అన్నా నిర్లక్ష్యంగా.

'ఎలా కరిచింది?' సరిగా తెలిసికోవాలనే కుతూహలంతో ప్రశ్నించేడు. నేనెట్లా నీటిలో దిగవలసి వచ్చిందో, ఆ మొసలికి నన్నే కరవవలసిన అవసరమెట్లా కలిగిందో అనే అనుమానం నివృత్తి చేసుకుందామని.

'మామూలుగా నోటితోనే కరిచిందండీ,' అన్నా, సీరియస్‌గా.

'అవును లెండి...' అంటూ ఆయన తెలిసినట్లే తల ఊపేడు. 'నోటితోనే కరిచి ఉంటుంది లెండి...కాని ఎక్కడ?'

కట్టుకట్టిన చోట రెండో చేత్తో చూపిస్తూ 'ఇక్కడే కరిచిందండీ. అమాంతం నోరు తెరుచుకునివచ్చి కరిచేసింది!' అన్నా, కరవడంయొక్క క్రియను వేళ్లతో చూపిస్తూ.

'అబ్బే, అదికాదండీ' అని అందుకున్నాడు, మార్వాడీ. 'మిమ్మల్ని ఆ మొసలి ఎక్కడ అంటే ఏ స్థలంలో కరిచిందని ఆయన ఉద్దేశ్యం.'

అలాగే తొణక్కుండా మళ్లా చెప్పేను, 'ఇక్కడే, యీ స్థలంలోనే అంటే మడమమీద కరిచింది.' రెండు సార్లు ఆ చోట చేత్తో చూపెట్టేను. 'ఇక్కడే, దాని తస్సాదియ్యా యిక్కడే కరిచిందండీ!'

కొంచం విసుక్కుని లక్ష్మణరావు మళ్ళా అడిగేడు, 'అదికాదండీ ఏ విధంగా, ఏనది దగ్గర లేక ఏ చెరువు దగ్గర మిమ్మల్ని మొసలి కరవవలసిన అవసరం వచ్చింది? విపులంగా చెప్పండి.'

'ఆహా! మీ ఉద్దేశం తెలిసింది లెండి.' అన్నాను. 'ఇప్పుడు చెప్తాను వినండి. మా వూళ్లో నది ఉందే, అందులో పెద్ద మొసలి ఒకటుంది. ఒక రోజున ఆ మొసలిని పట్టడానికి పది మణుగుల గాలం తయారుచేయించి నది ఒడ్డునే చెట్టుకి కట్టి దానికి మాంసం గుచ్చి ఉంచేను. రాత్రి ఎనిమిదయే సరికల్లా మొసలి గాలానికి తగులుకుంది.'

ఎవరైనా యీ సంగతి నమ్ముతారా? రైల్లో యిది విన్నవాళ్ళంతా చాటు చాటుగా నవ్వుకోడం మొదలు పెట్టేరు. 'మొసలేమిటి గాలానికి చిక్కుకోవడమేమిటి?'అనిఅందరూఅడిగారు!

'ఇంకా కథ అయిపోలేదు. చెప్తావినండి,' అని మళ్ళా చెప్పడం మొదలు పెట్టేను. 'అయిదారుగురు పెద్ద మనుష్యుల్ని తీసికొని నదికి వెళ్ళాను. వాళ్ళంతా మొసల్ని పైకిలాగి ఒడ్డున పడేశారు.' ఇంతలో స్టేషను రావడంవల్ల కథకు అంతరాయం కలిగింది.

ఆ స్టేషనులో ఎక్కేవాళ్లంతా ఎక్కి, దిగేవాళ్లు దిగడం తంతంతా యథావిధిగా జరిగింతర్వాత, నా ప్రక్కను ఒక సబిన్‌స్పెక్టరు స్థిరపడ్డాడు. రైల్వే పరిచయాన్ని పురస్కరించుకొని కొంతసేపు ఆమాటా, యీమాటా, పేపరు విషయాలూ మాట్లాడుకొన్నాం. అంతటితో ఊరుకోక అతనుకూడా అడిగేడు,'చేతికాకట్టేమిటండీ?' అని.

మళ్ళా మొదలు కాబోలు అనుకొని 'పాము కరిచిందండీ!' అన్నా సీరియస్‌గా.

'అమ్మో! త్రాచుపామా?'

'ఆఁ! ఫస్టు నల్లత్రాచండీ.' అని అటూ, ఇటూ యిందాకటి కథ విన్న మనుషుల కేసి చూశా. మొసలి కథ పూర్తిచేస్తాననీ, వినాలనీ, కుతూహలంగా కూర్చున్న వాళ్ల ముఖభంగిమలు యిట్టే మారిపోయాయి!

'ఎలా?...ఎక్కడ కరిచింది?...ఎందుకు కరిచింది...ఎప్పుడు?' సబిన్‌స్పెక్టరు దొంతర దొంతర్లుగా ప్రశ్నించేడు.

'మొన్న కరిచిందండీ' అన్నా.

'ఎక్కడ? ఏంచేస్తున్నారు మీరప్పుడు?'

'ఇక్కడ' అంటూ కట్టు చూపించాను. 'అప్పుడు భోంచేస్తున్నా.'

'తరువాత ఏమైంది?'

'తరువాతే పాము కరిచింది.' అన్నా. నేను చెప్పేది వాళ్ళకేమీ అర్థం కావడం లేదు.

'ఎలా?' అన్నాడు, సబిన్స్పెక్టరు. విపులంగా తెలిసికోవాలనేకుతూహలం ముఖంలో కనపరుస్తూ

'ఇలా కరిచింది' అన్నా, పాము ఎలా కరుస్తుందో వేళ్ళతో చూపెడుతూ.

'అదికాదండీ. అసలు ఏమైంది? పాము మీరు భోజనం చేసేదగ్గరకెలా వచ్చింది? సంగతి సందర్భాలు వివరంగా చెప్పండి మరి.' అన్నాడు సబిన్స్పెక్టరు.

పాము కథ పూర్తిగా చెప్పేను. ఎలా, ఏమేమి చెప్పానో జ్ఞాపకంలేదు కాని, చాలా బాగా మాత్రం చెప్పి పూర్తిచేశాను. ఇంత వరకూ మొసలి కథ విన్నవాళ్లు యీ కథ విని ఉలిక్కిపడ్డారు.

'మరి, మొసలి కరిచిందని చెప్పేరు. అన్నాడు లక్ష్మణరావు.

'మొసలి ఎలా కరుస్తుందండీ. అయినా ఆ మాట మీరెలా నమ్మేరు? నన్ను అసలు మొసలి కరవనేలేదు.' అన్నా.

మొదట్లో కొంతమంది నవ్వినా, నేనుచెప్పే తీరుచూసి వాళ్లేమీ మాట్లాడలేదు. అప్పటికి కొద్దిగా మనశ్శాంతి చిక్కింది. రోజల్లా యీ ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక పడ్డ అవస్థ వల్ల కలిగిన విసుగు తగ్గింది. ఇంతసేపూ నేను వాళ్లకు చెప్పిన సమాధానాలు తల్చుకుంటే నాకే నవ్వువచ్చింది. మరెవరైనా యీ దెబ్బ విషయము అడుగుతారని చూశా, కాని గమ్యస్థానం చేరుకునే వరకూ ఎవ్వరూ అడగలేదు. అత్త వారింటికి చేరుకున్నాను.

ఇంటికి వెళ్లేసరికి రాత్రిబాగా చీకటిపడింది. భోజనం చేస్తుండగా అత్తగారడిగింది, 'ఏం, నాయనా! చేతికా కట్టేమిటి?'

అందరికీ జవాబు చెప్పడమనే బాధ తప్పే దిలా కనబడలేదు. అడిగేవాళ్లకి చెప్పేవాళ్లు లోకువనే విషయం అక్షరాలా నిజం.

'తుపాకిదెబ్బ తగిలింది' అన్నా, మనసులో మండి పడుతూ.

'అమ్మ నాయనో, తుపాకిదెబ్బే!' హడలి పోయింది. 'ఎలా తగిలింది, బాబూ!'

'తుపాకి గొట్టంలోంచండీ'

'అది కాదోయ్! ఎందుకు తగిలింది, అని'

ఈ జవాబులు చెప్పలేక ఎంత బాధ పడుతున్నానో, భగవంతుడికెరుక. నాలో సహనం పూర్తిగా తగ్గిపోయింది. మేడమీదకు చూశా, శ్రీమతి ఉందేమోనని. మేడమీద గదిలో దీపం వెలుగూ లేదు, ఆమె ఉన్న జాడా లేదు. అత్తగారు యింతసేపు మాట్లాడింది కాని, అమ్మాయి యింటిదగ్గరుందో, లేదో తేల్చలేదు. మాటల సందర్భంలో మరదలు పిల్లే తేల్చి చెప్పింది, 'అక్కయ్యా, నేనూ పిన్నిగారింటికెళ్లాం. అక్క భోజనం చేసింతరవాత వస్తుంది' అని.

మెల్లగా మేడపైకి వేంచేసి నాకోసం అమర్చిన పక్కమీద విశ్రమించా. మధురమైన వాంఛలు మనసులో నాట్యంచేస్తూంటే, అనుభవించే యోగ్యత లేక ఎప్పుడో నిద్రపట్టింది. మగతగా. అర్థరాత్రివేళ నాకే తెలివివచ్చిందో, కోమలకరపల్లవాల తాకిడికే వచ్చిందో కాని, తెలివిమాత్రం వచ్చింది. క్రీనీడలో కదిలే మానవాకారాన్ని చూసి, 'ఎవరు?' అన్నా. చిరునవ్వు నవ్వుతూ వచ్చి నిల్చుంది, శ్రీమతి. ఆవిడ నాకోసం ఆలా రాత్రంతా నిరీక్షిస్తూందన్న మాట! కొత్తకాపరం మూలాన తనకై తాను రాలేకపోయింది, దగ్గరకు. ఏంమాటాడాలో అని ఆలోచిస్తూన్నట్లే ఉంది. 'దెబ్బ తగిలిందాండీ, చేతికి కట్టుకట్టేరు?' - మొట్టమొదటి ప్రశ్న ప్రేయసీ ప్రియుల ప్రణయ నాటకానికి నాందీ వాక్యం !!

'ఓరిదేవుడా, ఏంజవాబిచ్చేది!...'

'మాపుల తూపులు గాయపరచినవి. ఎట్లని తిరిగి అడిగెదవా?' అన్నాను.

ఎంత దెబ్బ తగిలినా సరే. జన్మలో యింక కట్టు కట్టించుకోకూడదనుకున్నాను. దేవుడు, నా ప్రతిజ్ఞ చెల్లించాలే కాని.

(హిందీ మాతృక)